క్లుప్తంగా

నేడు సంబేపల్లెకు ఎంపీ, ఎమ్మెల్యేలు

సంబేపల్లె : మండలానికి రాజంపేట ఎంపీ పి.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం రానున్నారు. మండలంలోని గుట్టపల్లె పంచాయతీలోని అంకిరెడ్డిగారిపల్లెలో ప్రభుత్వం నిధులతో సర్పంచ్ చిదంబరంరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గ్రామ సముదాయాలను మంగళవారం ఉదయం జరిగే కార్యక్రమంలో వారు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సీఈసీ గ్రూపు మంజూరు

రాజంపేట టౌన్ : పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ఈ ఏడాది సీఈసీ గ్రూపు మంజూరైనట్లు బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ఎంపీసీ గ్రూపుతోపాటు ఈ ఏడాది సీఈసీ గ్రూపు కూడా ఉన్నందున టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు పైరెండు గ్రూపుల్లో ఏదో ఒక గ్రూపు ఎంచుకొని చేరవచ్చని తెలిపారు. అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులు ఉన్నారన్నారు. అలాగే కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి ఉందని, ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441931787 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా కీలకం


సిద్దవటం: యోగా చేస్తున్న విద్యార్థులు

సిద్దవటం : ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, ఏకాగ్రతతో ఉండాలంటే ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా ఆసనాలను వేయాలని సిద్దవటం గ్రంథాలయం అధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం గ్రంథాలయాధికారిణి మాట్లాడుతూ సోమవారం సమ్మర్ క్యాంపునకు 20 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. వీరికి పుస్తక పఠనం, నీతి కథలు, పద్యాలు, వార్తా పత్రికలను చదివించడంతోపాటు యోగా చేయించామన్నారు. యోగా ఆసనాలు చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడటంతోపాటు శరీరాన్ని, మనస్సును బ్యాలెన్స్ చేసే శక్తి యోగాసనాలకే ఉందని ఆమె అన్నారు.

అన్నదానం



రాజంపేట రూరల్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పాతబస్టాండ్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్ పోతుగుంట రమేష్‌నాయుడు తల్లి లక్షుమ్మ 4వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వై.సుబ్రమణ్యంరాజు, రీజన్ చైర్మన్‌లు ఎస్.అబ్దుల్లా, ఎం.రామకృష్ణమనాయుడు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న ఖాతాదారులు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల కెనరా బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న పృథ్వీతేజ్ రెడ్డి శిబ్యాలకు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం ఆయనను బ్యాంకు ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. పృథ్వీతేజ్‌రెడ్డి సేవలను ఖాతాదారులు కొనియాడారు.

24 నుంచి సిద్దవరంలో గడప గడపకు కార్యక్రమం

పెనగలూరు : సిద్దవరం పంచాయతీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని పెనగలూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కేతా చక్రపాణి తెలిపారు. 24వ తేదీన తిరుమలరాజుపేట, ఎగువసిద్దవరం గ్రామాలలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డిలు పాల్గొంటారన్నారు.

వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

మదనపల్లె సిటీ: వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సోమవారం జిల్లా ఆస్పత్రిలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీలకు వృత్తి నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లినికల్ మేనేజ్‌మెంట్‌లో సామర్థ్యం పెంపొందించుకోవాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ కేర్‌లో భాగంగా సిపిఆర్ నిర్వహణ, పాముకాటుకు గురైనవారికి ప్రాణాపాయం నుండి కాపాడటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

మాసాపేట.. సంక్షేమ పథకాల పూతోట

గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : అనునిత్యం ప్రజలందరి సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం జగనన్న ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని మాసాపేట- 2 సచివాలయం పరిధిలోని 1,31,34 వార్డులలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, స్థానిక నేతలు జీఎండీ ఇమ్రాన్, జీఎండీ ఇర్షాద్, సుగవాసి శ్యామ్‌కుమార్ తదితరులతో కలసి జెండా మానువీధి, బాటమాకుల వీధి, గంగమ్మగుడి వెనుక వీధి, వేంపల్లె మెయిన్‌రోడ్డు, వరిగ రోడ్డు, మిషన్ వెనుకవీధి, అకులవీధిలలో తిరిగారు.

జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు పూతోటగా మాసాపేట మారిందని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ప్రజలు, మహిళలు ఆత్మీయస్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తాము అభివృద్ధి బాటలో పయనిస్తున్నామని పలువురు ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అన్నిరంగాల్లో సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

రాయచోటిని జిల్లా కేంద్రంగా కావడం మాసాపేట శివార్లలోని కలెక్టరేట్, ఎస్పీ, డీఎంఅండ్‌హెచ్‌ఓ తదితర ముఖ్య కార్యాలయాల ఏర్పాటుతో తమ ప్రాంతంలో అభివృద్ధి వెలుగులో పయనిస్తోందని ప్రజలు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. ఊరికి ఒక వైపుగా విసిరేయబడినట్టు ఉండే మాసాపేట మాండవ్య నదిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంతో రాయచోటిలో పూర్తిగా కలసిపోయిందన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా మారి అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందంటూ ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేశారు.

సమస్యలకు పరిష్కారం!

మాసాపేటలో ప్రజల కోరిక మేరకు రూ.10 లక్షలతో వాటర్ ట్యాంకు వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆర్టీసీ డ్రైవర్ అల్లా బకాష్‌ను ఎమ్మెల్యే ఈసందర్భంగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజావసరాల మేరకు పలువీధులలో అదనంగా విద్యుత్ లైన్‌లు, స్తంభాలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలంటూ ట్రాన్స్‌కో అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సిపి నేతలు హబీబుల్లాఖాన్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, స్థానిక కౌన్సిలర్‌లు, అమ్మాజీ, సుగవాసి ఈశ్వర్, ఆసిఫ్ అలీఖాన్, అల్తాఫ్, కో-ఆప్షన్ అయ్యావారురెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు సుగవాసి శ్యామ్‌కుమార్, దేవేంద్ర, అమీర్, జావేద్, కొలిమి చాన్‌బాషా, ఫయాజ్ అహమ్మద్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, గువ్వల బుజ్జిబాబు, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, కొత్తిమీర ప్రసాద్, హజరత్ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, వేదికపై మున్సిపల్ ఛైర్మన్, వైస్ చైర్మన్‌లు

రాయచోటి అర్బన్ : సమష్టి కృషితో రాయచోటి మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికలతో, మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ పాలవకర్గం కృషి చేయాలంటూ సూచించారు. అత్యవసరమైన పనులు, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, పట్టణం సుందరీకరణ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామంటూ చెప్పారు. రూ.8.17కోట్ల మున్సిపల్ నిధులతో ఏకకాలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమన్నారు. సచివాలయం వార్డు అభివృద్ధికి, గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా ఒకొక్క సచివాలయానికి రూ. 20 లక్షల చొప్పున 25 సచివాలయాలకు రూ.5 కోట్ల నిధులు వస్తున్నాయన్నారు. ఇందుకు అదనంగా మరో రూ. 12కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ముమ్మరం చేద్దామని ఆయన కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. రూ.1.40 కోట్ల అంచనాలతో చేపట్టిన నిర్మిస్తున్న సభాభవనాన్ని ఆగస్టు నెలాఖరులోపు పూర్తిచేయాలంటూ ఆయన అధికారులను ఆదేశించారు. ఏకగ్రీవ ఆమోదంతో సభా భవనానికి వైఎస్ఆర్ సభా భవనంగా నామకరణం చేద్దామంటూ సూచించారు. కొత్తపేట రామాపురంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుదామని ఆయన పాలకవర్గసభ్యులకు పిలుపునిచ్చారు. ప్రాంగణంలో చేపట్టిన పార్క్‌ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర పనులను నాణ్యంగా చేపట్టి అందరికి రోల్‌మోడల్‌గా నిలవాలన్నారు. ఎస్ఎన్ కాలనీలోనూ పార్క్‌ల నిర్మాణాన్ని త్వరగా చేపడతామంటూ చెప్పారు.

మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల కనెక్టివిటీని పెంచుదామని ఈ సందర్భంగా కౌన్సిలర్‌లు, అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గున్నికుంట్ల రహదారిలో వీధిలైట్ల సంఖ్యను మరింతగా పెంచాలన్నారు. ఠాణా, గాంధీబజారు, కంసల వీధి, హరినాథ వీధి రహదారుల విస్తరణాభివృద్ధి చేద్దామన్నారు. రూ.1.50 కోట్ల నిధులతో శిల్పారామం పనులు ప్రారంభిస్తామన్నారు. జూలై రెండవ వారంలోపు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులను పూర్తిచేయించేలా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలంటూ కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగజేసినా, లంచం తీసుకున్నా సహించబోమని శ్రీకాంత్‌రెడ్డి అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. మున్సిపాలిటీలో ఏదైనా పనుల కోసం లంచాలు ఇవ్వకపోతే కొర్రిలు వేస్తున్నారన్న మచ్చ ఉందన్నారు. తప్పుచేసినా, లంచం తీసుకున్నా కఠినచర్యలు తప్పవంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఛైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష మాట్లాడుతూ కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మున్సిపాలిటీలో అభివృద్ధిని పరుగులు పెట్టిద్దామన్నారు. కమిషనర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు నివాస స్థలాలు ఇచ్చి ఆదుకోండి

రాజంపేట రూరల్ : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని 11 మండలాలలో ఉన్న కళాకారులకు నివాస స్థల పట్టాలిచ్చి ఆదుకోవాలని కళాకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డిని కళాకారులతో కలిసి వెంకటరెడ్డి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రెండు నియోజకవర్గాలలో ఉన్న 38 మంది కళాకారులకు కళాకారుల కాలనీ పేరుతో రాజంపేట పట్టణానికి సమీపంలో ఒకే చోట నివాస స్థలాలు ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డిని కళాకారుల తరపున వెంకటరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు వేలూరు కృష్ణయ్య, కాకర్ల రవీంద్ర నాయుడు, ఎం.సుబ్బరాయుడు, ఎన్.సుబ్రమణ్యం ఆచారి, మారోతు గంగయ్యనాయుడు, ఈరి సంటెయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీలుగల పంపిణీ


రైతులకు జీలుగలు అందజేస్తున్న గ్రామ సర్పంచ్ నాగర్జునాచారి

వీరబల్లె (రాయచోటి టౌన్) : రైతులకు జీలుగలను పంపిణీ చేశారు. సోమవారం మట్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ నాగార్జునాచారి ఆధ్వర్యంలో రైతులకు జీలుగలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ జీలుగల చల్లుకొని పచ్చరొట్టను తయారు చేసుకొని తరువాత పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. ప్రస్తుతం 300 కిలోల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మంజూష, పుల్లగూర కేశవులు, వార్డు సభ్యులు నారాయణ రాజు, మడితాటి రాజారెడ్డి, పుల్లగూర ధర్మయ్య నందలూరి నాగబసిరెడ్డి పాల్గొన్నారు.

మట్టి తోలుకునేందుకు అనుమతులివ్వండి


తహసీల్దార్ పీర్ మున్నికి వినతిపత్రం అందజేస్తున్న దళిత రైతులు

ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు చెరువు నుంచి పంట పొలాలకు రైతులు మట్టి తోలుకునేందుకు అనుమతులివ్వాలని యల్లాయపల్లి సర్పంచ్ జరుగు నారాయణ రెడ్డి తహసీల్దార్ పీర్ మున్నిని కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందనలో ఆగ్రామ రైతులు, సర్పంచ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెరువు నుంచి పంటపొలాలకు మట్టి తోలుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు మట్టితోలుకునేలా అనుమతులివ్వాలని కోరారు. తహశీల్దార్ పీర్ మున్నీ మాట్లాడుతూ రైతులు మట్టితోలుకోవాలంటే ఇరిగేషన్ వారి అనుమతులు తీసుకోవాలని, రెవెన్యూశాఖ తరఫున తాము సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, గుండయ్య తదితరులు పాల్గొన్నారు.

మా భూములకు హద్దులు చూపించండి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జెడ్‌హెచ్‌డీసీ భూములలో మాకు భూములు కేటాయించారని, మా భూములు మాకు చూపించాలని సోమవారం తహసీల్దార్ పీర్ మున్నికి చిన్నఓరంపాడు దళితవాడ గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2005లో అప్పటి ప్రభుత్వం చిన్నఓరంపాడు కంపలి దళితవాడ, జ్ఞానంపల్లి దళితవాడ గ్రామాలలో నిరుపేదలైన 140 మంది దళిత రైతులకు ఒక్కొక్కరికి ఎకరా చొప్పున పట్టాలు ఇచ్చారన్నారు. అయితే అప్పటి నుంచి తమ భూములకు హద్దులు చూపించలేదన్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న జెడ్‌హెచ్‌డీసీ భూముల సర్వేలోనైనా మా భూములకు హద్దులు చూపించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్, మండల ఎస్సీ నాయకులు బీఆర్ ప్రేమ్, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి పథకానికి బడ్జెట్ పెంచండి


ధర్నాచేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు

రాయచోటి అర్బన్ : ఉపాధిహామీ పథకానికి నిధుల కేటాయింపును పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు జయరామయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం కోసం కేంద్రబడ్జెట్‌లో నిధులను పెంచాలన్న డిమాండ్‌తో ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో ఫొటో హాజరు వలన కూలీలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఉపాధి పనులు చేపట్టే ప్రాంతాల్లో గతంలో ఉన్న మౌలిక సదుపాయాలైన టెంటు సౌకర్యం, మంచినీళ్లు, మజ్జిగ, మెడికల్‌కిట్టు, బీమా పథకం, పనిముట్లు, సమ్మర్ అలవెన్స్, మేట్‌లకు అలవెన్స్ తదితరాలను లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి తక్కువబడ్జెట్ కేటాయించి గ్రామీణ పేదలకు ఉపాధి పనులను దూరం చేసే ప్రయత్నం చేస్తోందంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని డీఆర్ఓ సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రామాంజులు, ఓబులమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేతలు సురేంద్రారెడ్డి, నరసింహ, రామచంద్ర, వర్మ, శివయ్య, పెంచలయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ మేడా, అధికారులు

నందలూరు (ఒంటిమిట్ట) : మండల కేంద్రంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో సోమవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన తహసీల్దారు సదానందం, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, హౌసింగ్ ఏఈ పెంచలయ్యలు ఇళ్ల స్థలాల కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నందలూరు గ్రామ పంచాయతీలో జగనన్న కాలనీకి సుమారు 10 ఎకరాల స్థలాన్ని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సహకారంతో ప్రభుత్వం కొనుగోలు చేసి, పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలనే ఉద్దేశంతో, లేఅవుట్ ఫార్మేషన్‌ను దుర్గాపురం వద్ద స్థలాన్ని కేటాయించిందన్నారు. దీంతో జంగిల్ క్లియరెన్స్, రోడ్ ఫార్మషన్, సుమారు 400 ఇళ్లకు ప్లాట్ల కేటాయింపునకు సన్నాహాలు చేసి భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, వీఆర్ఓ రాజు, సర్వేయర్ వెంకటేష్, మండల కోఆప్షన్ సభ్యులు కలీమ్‌ఖాన్, బీసీ నాయకులు తుమ్మల శ్రీధర్‌గౌడ్, కన్యక పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

నందలూరు(ఒంటిమిట్ట) : మండలంలోని గ్రామ వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎర్రచెరువుపల్లె, టంగుటూరు గ్రామ పంచాయతీల్లోని గ్రామ వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలను అందజేశారు. వలంటీర్ విజయలక్ష్మికి సేవారత్న అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఎన్‌సీసీ అధికారుల ధన్యవాదాలు

వైవీయూ : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీల్లో ఎన్‌సీసీ అధికారులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించడంపై ఏపీ ఎన్‌సీసీ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. సుబ్బారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎల్.దుర్గారావు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి జారీచేసిన జీఓనెంబర్ 47లో ఎన్‌సీసీ ఉపాధ్యాయులకు అనుకూలంగా పలు అంశాలను పొందుపరచడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సహకారం అందించిన ఎమ్మెల్సీలు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మోసపూరిత యాప్‌లను అరికట్టండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జీవీ ఫుట్‌బాల్, మూన్ ఫుట్‌బాల్ లాంటి ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌ల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ తుషార్ డూడికి సీపీఐ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు జీవీ, మూన్ ఫుట్‌బాల్ లాంటి ఎన్నో ఆన్‌లైన్ మోసపూరిత యాప్‌లను ప్రవేశపెట్టి ప్రజలను దోచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. జిల్లాలో 50 వేల మందికి పైగా ఆత్యాశకు గురై దాదాపు రూ.100 కోట్ల వరకు జీవీ, మూన్ ఫుట్‌బాల్ యాప్‌లో ఇన్వెస్ట్ చేశారన్నారు. ఇటువంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ప్రజలు నష్టపోకుండా సైబర్ నేరగాళ్ళ బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేసి కాపాడాలన్నారు. సీపీఐ నాయకులు మైనుద్దీన్, మిడుతూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ రాకుండా జాగ్రతలు తీసుకోండి


డాక్టర్ శివకుమార్

సిద్దవటం : అధిక ఉష్ణోగ్రత వల్ల వచ్చే వడదెబ్బ సోకకుండా వయోవృద్ధులు, చిన్నపిల్లలు జాగ్రతలు తీసుకోవాలని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా తాగునీరు, మజ్జిగను తీసుకోవాలన్నారు. ఇటీవలే వడదెబ్బకు శివునిపల్లె, మిట్టపల్లె గ్రామాలలో ఇద్దరు మృత్యువాత పడ్డారన్నారు. వడదెబ్బ లక్షణాలు ఎక్కువగా శరీరం వేడిగా ఉండటం, వాంతులు లక్షణాలుగా ఉంటాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవసరమైతేనే బయటకు రావాలని అది కూడ గొడుగు తీసుకొని రావడం , తలపై టవల్ వేసుకొని రావాలని సూచించారు.

కేతు విశ్వనాథరెడ్డి మరణం బాధకరం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, సుప్రసిద్ధ కథా రచయిత కేతు విశ్వనాథరెడ్డి మరణం బాధాకరమని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి 'కడప జిల్లా గ్రామ నామాలు' అనే అంశంపై పరిశోధనలకు గాను డాక్టరేట్ పొందారన్నారు. పాత్రికేయుడిగా, అధ్యాపకుడిగా ఆయన సేవలు ఎనలేనివన్నారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి దాకా అనేక పాఠ్య పుస్తకాలకు సంపాదకత్వం వహించి పాఠ్య ప్రణాళికలను రూపొందించారని పేర్కొన్నారు.

సారా విక్రేత అరెస్టు

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం తవళం గ్రామానికి చెందిన చినప్పరెడ్డి తవళం క్రాస్ సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం : స్థానిక ప్రసన్న పార్వతి సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం సేవకులు పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేద పండితులు ఆలయంలోని శివ పార్వతుల ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

చిట్వేలి : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా పేదల సంక్షేమమే లక్ష్యంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నారని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం స్థానిక ఉపసర్పంచ్ చొడవరం ఉమామహేశ్వర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాతచిట్వేలి (రాజుపాలెం)లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతోపాటు స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్తూ అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం నిమిత్తం అధికారులకు ఆదేశిస్తూ ముందుకు కదిలారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ప్రతి గడపనా కొరముట్లకు ప్రజలు నీరాజనం పలికారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, సీనియర్ నాయకులు ఎల్‌వీ మోహన్ రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, లింగం లక్ష్మీకర్, ఎంపీపీ చంద్ర, ఎంపీటీసీలు ఈశ్వరమ్మ, శ్రీనివాసులు రెడ్డి, శివారెడ్డి, నరసింహులు, హజరత్ రెడ్డి, నవీన్, సుబ్రమణ్యం, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంట నష్టాన్ని అంచనా వేయండి


దెబ్బతిన్న మామిడి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, అధికారులు, నాయకులు

సుండుపల్లె (రాయచోటి టౌన్) : గాలివానలతో నష్టపోయిన మామిడి పంటను అంచనా వేసి, నివేదికలు సిద్ధం చేయాలని ఉద్యాన అధికారులను రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన సుండుపల్లె మండలంలో గాలివానకు నేల రాలిన మామిడి పండ్ల తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని సూచించారు. నేరుగా రైతులతో మాట్లాడారు. వారికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సుండుపల్లె బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఉన్న బస్టాండ్ ప్రయాణికులకు అనుగుణంగా లేదని అధికారులు చెప్పడంతో అనువైన స్థలాన్ని పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం పెదినేని కాల్వలో ఓ విందులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి, రహిమాన్ ఖాన్, మంత్రి శివారెడ్డి, ఎంపీపీ రమణమ్మ, తహసీల్దార్ చాందిని, ఎంపీడీఓ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందరెడ్డి, సర్పంచ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం


మొక్కని నాటుతున్న కొండూరు అజయ్ రెడ్డి

పెనగలూరు : పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కె.అజయ్‌రెడ్డి అన్నారు. ఫారెస్టు లైఫ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో చెట్లను నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి దానిని పరిరక్షించి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అలాగే పచ్చని చెట్లు ఉండటం వలన వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని ఆయన తెలియజేశారు. దీంతోపాటు ప్లాస్టిక్‌ను వినియోగించడం వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నారు. అనంతరం ఫారెస్టు అధికారి సావిత్రి మాట్లాడుతూ జూన్ 5వ తేదీ వరకు ఫారెస్ట్ లైఫ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఫారెస్టు అధికారి సుబ్బయ్య, బుజిరెడ్డి, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలను పరిష్కరించండి

స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ విజయ్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పందన కార్యక్రమానికి వచ్చిన రైతుల సమస్యలను నేరుగా తెలుసుకొని వారి సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. ముఖ్యంగా రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేలన్నారు. అలాగే పాఠశాల, కళాశాలలో చేరేందుకు విద్యార్థులు నమోదు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌రావుతో వారు పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

'బ్రౌన్' కేంద్రం అభివృద్ధికి కృషి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి సుధాకర్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా సోమవారం సాయంత్రం బ్రౌన్ కేంద్రాన్ని సందర్శించారు. వీసీ మాట్లాడుతూ ఉద్యోగులంతా సమిష్టి కృషితో ఈ కేంద్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేయాలని సూచించారు. బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యులు, ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సిబ్బంది ఆయన్ను సన్మానించారు. ఆ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు రమేష్‌రావు, హరిభూషణరావు పాల్గొన్నారు.